క్లుప్తంగా

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

గోదావరిఖనిటౌన్: నగరంలోని ప్రధాన చౌరస్తాలో మంగళవారం రాత్రి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా రేణుక ఎల్లమ్మ బోనాల పండుగ నిర్వహించారు. గౌడ కులస్తులు నగరంలోని పలు ఏరియాల నుంచి బోనాలతో బయలుదేరి చౌరస్తాకు చేరుకున్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ పాల్గొని మాట్లాడారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్, ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్, బీజేపీ నాయకులు కాసిపేట లింగయ్య, ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు హన్మంతుగౌడ్ పాల్గొన్నారు.

కిరాణం దుకాణాలు, హోటళ్లలో తనిఖీ



తనిఖీ చేస్తున్న కమిషనర్ మనోహర్

మంథని: పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీలు, కిరాణం షాపులను బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎన్.మనోహర్ తనిఖీ చేశారు. కల్తీ ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ వినియోగంపై పరిశీలించి ప్లాస్టిక్ వాడుతున్న దుకాణ యజమానులకు జరిమానా విధించారు. గడువు దాటిన ఆహార పదార్థాలను సీజ్ చేశారు. హెల్త్ అసిస్టెంట్ సునీల్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

జూలపల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని పీఏసీఎస్ డైరెక్టర్ గొట్టిముక్కుల రవీందర్‌రెడ్డి అన్నారు. పెద్దాపూర్ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద రైతుల సౌకర్యార్థం జూలపల్లి విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. సీఈవో సురేశ్, ఏఈవో కిరణ్మయి, డైరెక్టర్లు ఉయ్యాల వెంకటేశ్, బొజ్జ కనుకయ్య, మద్దెల స్వామి, బొజ్జ శ్రీనివాస్, గోపాలకృష్ణ ఉన్నారు.

విద్యార్థికి సన్మానం



సన్మానిస్తున్న సీఐ, ఎస్సై, ఎంఈవోలు

రామగుండం: ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీలో రాష్ట్రంలో రెండోస్థానం సాధించిన విద్యార్థినికి బుధవారం అంతర్గాం హైస్కూల్ ప్రాంగణంలో సన్మానించారు. మండల పరిధిలోని అంతర్గాం గ్రామానికి చెందిన తమ్మనవేణి ప్రకాశ్ కూతురు సంజన ఇంటర్ జగిత్యాల జిల్లా తాటిపెల్లిలోని గురుకుల విద్యాలయంలో చదివింది. ఎంపీసీలో 994 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో సెకండ్ ర్యాంక్ సాధించింది. ఈ మేరకు సంజనను రామగుండం సీఐ తంగళ్లపల్లి ప్రవీణ్, అంతర్గాం ఎస్సై బోయ వెంకటస్వామి, మండల విద్యాధికారి ఏకాంబరం, ఉపాధ్యాయులు శోభారాణి సన్మానించారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కమాన్‌పూర్: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలో నిర్వహించే బీఆర్ఎస్ రతోత్సవ సభను విజయవంతం చేయాలని మండల కేంద్రంతో పాటు గుండారం, నాగారం, పేంచికల్‌పేట గ్రామాల్లో బుధవారం పోస్టర్ అవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

జూలపల్లి: వేసవి సెలవుల్లో విద్యార్థులను తల్లిదండ్రులు శ్రద్ధతో గమనించాలని, విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంచాలని హెచ్ఎం రవీందర్ సూచించారు. మండలంలోని తేలుకుంట ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఏఎస్ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు తీసుకు రావాలని సూచించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సునీత, టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి

యైటింక్లయిన్‌కాలనీ: వేసవికాలం దృష్ట్యా తల్లిదండ్రులు పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలని గోదావరిఖని టూటౌన్ రెండో సీఐ లింగమూర్తి సూచించారు. రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాకలోని నర్సింహపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలు, సెల్‌ఫోన్ వాడకంపై సీఐ అవగాహన కల్పించారు. చిన్న పిల్లలు బైక్ డ్రైవింగ్ చేయకుండా తల్లిదండ్రులు చూడాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన, 100శాతం హాజరైన, ఈ విద్యాసంవత్సరంలో క్లాస్ పరంగా మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం స్వర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యైటింక్లయిన్‌కాలనీ: విద్యార్థులకు బహుమతి అందిస్తున్న సీఐ లింగమూర్తి



గోదావరిఖనిటౌన్: మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

పాఠశాలల్లో అవగాహన

గోదావరిఖనిటౌన్: వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు పిల్లల జాగ్రత్తపై గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు పలు ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పాల్గొని మాట్లాడారు. సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ బాలుర పాఠశాలలో వన్‌టౌన్ అదనపు సీఐ రవీందర్, విఠల్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఎస్సై రమేశ్ అవగాహన కల్పించారు.

క్రమశిక్షణ కలిగి ఉండాలి

ఓదెల: విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ సూచించారు. మండలంలోని కనగర్తి హైస్కూలులో బుధవారం విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. ఎంఈవో ఎర్ర రమేశ్ పాల్గొన్నారు.

బసంత్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

పాలకుర్తి: విద్యార్థులు మద్యం, ధూమపానం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని బసంత్‌నగర్ ఎస్సై ఆర్.స్వామి సూచించారు. బసంత్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ విద్యాసంవత్సంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి, ఉపాధ్యాయులు శోభారాణి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



సుల్తానాబాద్‌లో బీజేపీ నాయకుల ర్యాలీ



ఓదెల: కొలనూర్‌లో దిష్టిబొమ్మ దహనం



జూలపల్లి: రమణయ్య వేసిన చిత్రలేఖనం



యైటింక్లయిన్‌కాలనీ: తెలంగాణ చౌరస్తాలో..

సుల్తానాబాద్: కశ్మీర్‌లో పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదులను ఎన్ కౌంటర్ చేయాలని కోరుతూ పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు రాజీవ్ రహదారి వెంబడి కొవ్వొత్తులతో ర్యాలీ వహించారు. ఎస్సై శ్రావణ్ కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సుల్తానాబాద్: కశ్మీర్ ఉగ్రదాడి మృతులకు సుల్తానాబాద్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ముస్లింలు శాంతి ర్యాలీ నిర్వహించి, కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

చిత్రలేఖనంతో నివాళి

జూలపల్లి: కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందిన టూరిస్టులకు పెద్దాపూర్‌కు చెందిన కవి, కళాకారుడు గుండు రమణయ్యగౌడ్ తన చిత్రలేఖనంతో నివాళి అర్పించారు. ఈ చిత్రంలో ఉగ్రదాడిలో మరణించిన వారు, భరతమాత కన్నీళ్లు పెట్టుకున్నట్లుగా, ప్రపంచ దేశాలు నివాళి అర్పించినట్లు, శాంతి పావురం గాయపడినట్లు చిత్రించారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి, మహేశ్, చక్రపాణి, రాజు, రాములు, తిరుపతి, కేశవులు పాల్గొన్నారు.

ఓదెలలో..

ఓదెల: కశ్మీర్‌లో పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదుల దిష్టిబొమ్మను బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని కొలనూర్, ఓదెల గ్రామాల్లో స్థానిక బీజేపీ నాయకులు బుధవారం దహనం చేశారు. మృతులకు నివాళి అర్పించారు. మాజీ ఎంపీటీసీ కారెంగల శ్రీనివాస్, బీజేపీ నాయకులు గోపు మల్లారెడ్డి, కొంగర అనిల్, పుల్ల సదయ్యగౌడ్, కలకొండ సంపత్‌రెడ్డి, దాత రాకేశ్, పృథ్వీరాజ్, వేణురెడ్డి, తాజ్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

గోదావరిఖని: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చేనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త గనులు, సంస్థ పరిరక్షణ, కార్మిక హక్కుల సాధన కోసం సమ్మె తప్పనిసరి అన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని, చట్ట ప్రకారం న్యాయబద్ధంగా సమస్యల పరిష్కారానికి ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, స్వామి, అరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, గోసిక మోహన్, కనకరాజు, ఎంఏ గౌస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

ధర్మారం పోలీస్‌స్టేషన్ సందర్శన



పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీసీపీ కరుణాకర్

ధర్మారం: ధర్మారం పోలీస్‌స్టేషన్‌ను పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చిన దరఖాస్తుదారులతో మంచిగా ప్రవర్తిస్తూ వారి సమస్యను పూర్తిగా వినాలని సూచించారు. ఏసీపీ గజ్జి కృష్ణ, ఎస్సై శీలం లక్ష్మణ్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాలకుర్తి: మండలంలోని జయ్యారం గ్రామానికి చెందిన మామిడాల శ్రీనివాస్(45) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. బసంత్‌నగర్ పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ వివిధ వ్యాపారాల నిర్వహణ కోసం అప్పులు చేశాడు. వ్యాపారాలు కలిసిరాకపోవడంతో ఆర్థికంగా నష్టపోయాడు. అప్పుల బాధ భరించలేక ఈనెల21న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు మామిడాల రాకేశ్ ఫిర్యాదు మేరకు బసంత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

• నిజాయితీ కమ్యూనిస్టులను కోల్పోయాం

సుల్తానాబాద్: నిజాయితీ కమ్యూనిస్టులను కోల్పోయామని పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మదన కుమారస్వామి అన్నారు. పట్టణంలోని పూసాలలో బండి రాజమల్లు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో మంగళవారం ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. జిల్లా పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్, తదితరులు ఉన్నారు.

• రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ రైల్వేగేట్‌తో సుమారు 20 గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గౌతమినగర్ రైల్వేలైన్ సింగరేణి బొగ్గు, ఆర్ఎఫ్‌సీఎల్ యూరియా తరలించే గూడ్స్ రైళ్లతో నిత్యం రద్దీగా ఉంటుంది. రైల్వే గేట్ సమస్య పరిష్కరించాలని ఎల్కలపల్లి గేట్ గ్రామానికి చెందిన దెబ్బెట భానుచందర్ మంగళవారం రాత్రి నగరంలోని ఇల్లెందు గెస్ట్ హౌస్‌లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు వినతిపత్రం అందించారు. రైల్వే గేట్ సమస్యను రైల్వేశాఖ మంత్రితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ హామీ ఇచ్చినట్లు భానుచందర్ తెలిపారు.

• బీఎస్పీలో చేరిక

మంథని: ముత్తారం మండలం ఖమ్మంపల్లికి చెందిన యాట సంపత్ బుధవారం బీఎస్పీలో చేరారు. మంథనిలో పార్టీ ఇన్‌చార్జి జనగామ రవికుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా కోశాధికారి పులిపాక బొంద్యాలు తదితరులు ఉన్నారు.

• నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలి

మంథని: వేంకటేశ్వరస్వామి కృపతో నియోజకవర్గ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని శ్రీపాద ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు ఆకాంక్షించారు. మండలంలోని కన్నాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కృష్ణుని విగ్రహ ప్రతిష్ఠాపనలో ఆయన పాల్గొన్నారు. అనంతరం వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండల అధ్యక్షుడు అయిలి ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రమాదేవి, నాయకులు శ్రీకాంత్, కుమార్ పాల్గొన్నారు.

• స్టడీ టూర్‌కు తరలిన మత్స్యకారులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మత్స్యసహకార సంఘాలకు చెందిన 25మంది మత్స్యకారులు బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో మత్స్య సంపదను వృద్ధి చేసేందుకు అనుసరిస్తున్న పద్ధతులపై అవగాహన పెంచుకునేందుకు తరలివెళ్లారు. కలెక్టరేట్ నుంచి మత్స్యకారులు ప్రయాణించే బస్సును నాబార్డు డీడీఎం జయప్రకాశ్, మత్స్యశాఖ జిల్లా అధికారి నరేశ్ జెండా ఊపి ప్రారంభించారు. కాకినాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్, బలభద్రపురంలోని లాబొరేటరీ, బిక్కవోలులోని సీతారామ ఎఫ్‌సీఎస్‌ను సందర్శించినట్లు వారు తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, శాస్త్రవేత్త శ్రీనివాస్ ఉన్నారు.

• విద్యార్థులకు సన్మానం

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కమాన్‌పూర్ ఎస్సై ప్రసాద్ సన్మానించి ప్రశంస పత్రాలు అందజేశారు.

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని శంకర్‌గంజ్, సాగర్ రోడ్డు, పోలీస్‌స్టేషన్, మోయిన్‌పుర, అమర్‌నగర్, వ్యవసాయ మార్కెట్, అయ్యప్పగుడి, క్రిస్టియన్ కాలనీ, చందర్‌కాకనగర్, కొంతంవాడ, ప్రగతినగర్ ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 9వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

• లారీని ఢీకొన్న ఆటో

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద కరీంనగర్ నుంచి కాట్నపల్లి వైపు వస్తున్న ఆటో ఆగి ఉన్న లారీని బుధవారం ఢీకొన్నది. ఆటో డ్రైవర్ అజయ్‌కి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు డ్రైవర్‌ను కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ఓసీపీల్లో పనివేళలు మార్చాలి

గోదావరిఖని: ఎండతీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఓసీపీల్లో పనివేళలు మార్చాలని ఐఎన్‌టీయూసీ కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతియాదవ్ డిమాండ్ చేశారు. ఓసీపీ–1లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్రాంతి గదిలో శుభ్రపరచిన కూలర్లను వెంటనే బిగించాలన్నారు. దుమ్ములేవకుండా ట్యాంకర్లు, దోజర్ల సంఖ్య పెంచాలని కోరారు. ఈ ఏడాది కూలర్ బిగింపులో కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో యాజమాన్యం ప్రత్యేక చొరవ తీసుకొని మిగతా కూలర్లను శుభ్రపరిచి వెంటనే బిగించాలని డిమాండ్ చేశారు. భారీ యంత్రాల్లో ఏసీలు సరిగా పనిచేయడం లేదని, వెంటనే మరమ్మతు చేయాలన్నారు. గుడిగంటి వెంకటస్వామి పాల్గొన్నారు.

సర్వే మజ్దూర్ పోస్టులకు రాతపరీక్ష

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలో సర్వే మజ్దూర్ పోస్టులకు బుధవారం యైటింక్లయిన్‌కాలనీ సింగరేణి స్కూల్‌లో రాత పరీక్షలు నిర్వహించారు. మూడు ఇంటర్నల్ పోస్టులకు పరీక్ష నిర్వహించగా 80మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. పర్సనల్ డీజీఎం అనిల్‌కుమార్, సర్వే అధికారి ఉజ్వల్ బదోపాధ్యాయ, పాఠశాల హెచ్ఎం ఎస్.సుందర్‌రావు ఉన్నారు.

సీపీఆర్‌పై నర్సింగ్ విద్యార్థులకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కోల్‌సిటీ: కార్డియో పల్మనరీ రిససిటేషన్(సీపీఆర్)పై అవగాహన పెంచుకుంటే గుండెపోటుకు గురైన వారిని కాపాడేందుకు దోహపడుతుందని గోదావరిఖని ప్రభుత్వ బాలికల నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసూన, వైస్ ప్రిన్సిపాల్ సుశీల అన్నారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం సీపీఆర్ చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సౌమిత్, నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, నర్సింగ్ కాలేజీ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థినులు, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీశ్ పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

పదోన్నతిపై వెళ్లిన అధికారికి సన్మానం

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3 ప్రాజెక్టు అధికారిగా పనిచేస్తూ కార్పొరేట్ ఐఅండ్‌పీఎం జీఎంగా పదోన్నతిపై వెళ్లిన ఎస్.మధుసూదన్‌ను బుధవారం సన్మానించారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. ఏరియా ఇంజినీర్ నరసింహరావ్, వర్క్‌షాప్ ఏజీఎం ఎర్రన్న, వకీల్‌పల్లి ఏజెంట్ నెహ్రూ, డీజీఎం పర్సనల్ ఎస్.అనిల్‌కుమార్, సివిల్ డీజీఎం ధనుంజయ, ఏరియా సర్వే అధికారి ఉజ్వల్ బదోపాధ్యాయ, వర్క్‌షాప్ డీజీఎం విజయ్‌కుమార్, ఓసీపీ–3 మేనేజర్ భారత్‌కుమార్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న జీఎం వెంకటయ్య

విధులకు గైర్హాజరు కావొద్దు

రామగిరి: సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం ఒక వరమని, విధులకు గైర్హాజరు కావొద్దని ఏపీఏ జీఎం కొలిపాక నాగేశ్వరరావు సూచించారు. అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు ఏరియాలోని వివిధ గనులు, విభాగాలలో విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో మెడికల్ ఇన్వాలిడేషన్, మృతి చెందిన ఉద్యోగులకు సంబంధించి వారి పిల్లలకు కారుణ్య నియామక పత్రాలు బుధవారం అందజేశారు. జీఎం మాట్లాడుతూ సీనియర్ ఉద్యోగుల సలహాలు, సూచనలు తీసుకొని సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, కె.నర్సింహచారి, పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, డీపీఎం గుర్రం శ్రీహరి పాల్గొన్నారు.



నియామక పత్రం అందిస్తున్న జీఎం నాగేశ్వరరావు

రెస్ట్ షెల్టర్లలో కూలర్లు ఏర్పాటు చేయాలి

గోదావరిఖని: మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని రెస్ట్ షెల్టర్లలో కూలర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని ఐఎన్‌టీయూసీ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు బదావత్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఓసీపీ–3 కృషిభవన్, బేస్‌వర్క్‌షాప్‌లో బుధవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, లేనియెడల భవిష్యత్‌లో చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాలకు పూర్తి బాధ్యత అధికారులు వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ.అక్రమ్, కొత్త సత్యనారాయణరెడ్డి, నాచగోని దశరథంగౌడ్, సాలిగామ మల్లేశ్, మేకల శ్రీనివాస్, ఆకుల రాజిరెడ్డి, తోకల సమ్మయ్య, మార్కండేయ, అశోక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

బీజేపీ హయాంలోనే రాజ్యాంగబద్ధమైన పాలన

పెద్దపల్లిరూరల్: బీజేపీ పాలనలోనే అంబేడ్కర్ రచించిన రాజ్యాంగబద్ధమైన పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. పెద్దపల్లిలో బుధవారం రాజ్యాంగ అవగాహన జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అన్నివిధాలా అణగదొక్కేందుకు కాంగ్రెస్ నేతలు యత్నించారని ఆరోపించారు. కానీ బీజేపీ పాలనలో అంబేడ్కర్ చిత్రపటాన్ని పార్లమెంట్‌లో ఏర్పాటు చేయించడంతో పాటు భారతరత్న ఇవ్వాలని సిఫారసు చేశామన్నారు. పశ్చిమబెంగాల్‌లో దాడులు జరుగుతుంటే కాంగ్రెస్ నేతలు నోరు మూసుకుని ఉన్నారని విమర్శించారు. దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు పల్లె సదానందం, జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు ఠాకూర్ రాంసింగ్, జ్యోతిబసు, విశ్వాస్, సతీశ్, బాపయ్య, శంకర్, లక్ష్మణ్, సమ్మయ్య, శ్రీనివాసరావు, జంగ చక్రధర్‌రెడ్డి, బెజ్జంకి దిలీప్, శివంగారి సతీశ్, రాజవీరు, మనోహర్, రమేశ్, నారాయణస్వామి, కరుణాకర్, ఓదెలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

రామగిరి: మండలంలోని బేగంపేట, నవాబ్‌పేట, లద్నాపూర్, రత్నాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్డీవో కాళిందిని బుధవారం తనిఖీ చేశారు. గన్నీ సంచుల కొరత లేకుండా చూడాలని, నిర్దేశిత రైస్‌మిల్లులకు వెంటనే ధాన్యం తరలింపు కోసం లారీలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధం పనిచేయాలని సూచించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. ఆలస్యం జరగడానికి వీలులేదని ఆదేశాలు జారీచేశారు. ఏపీఎం స్వరూపరాణి, సీసీలు శంకర్, బాపు, రమేశ్, శోభారాణి పాల్గొన్నారు.



కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో కాళిందిని

వినూత్న కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుంది

రామగుండం: విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టే కార్యక్రమాలు విద్యార్థులను ఆకర్షిస్తాయని, ఫలితంగా అన్ని రంగాల్లో ఆసక్తి పెరుగుతుందని రామగుండం సీఐ తంగళ్లపల్లి ప్రవీణ్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం పాఠశాల చివరి రోజు కావడంతో నిర్వహించిన వేడుకలకు సీఐ హాజరై మాట్లాడారు. హాజరుశాతం అధికంగా ఉన్న విద్యార్థులను గుర్తించి వారితో పాటు పేరెంట్స్‌కు ప్రోత్సాహక బహుమతి అందజేసి సన్మానించారు. చదువులో ప్రతిభ కలిగి అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి 'పంతులమ్మ గోరుముద్దలు' అనే వినూత్న కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారికి పాఠశాల హెచ్ఎం.అజ్మీరా శారద భోజనం తినిపించారు. రామగుండం ఎస్సై గుండేటి సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రోగ్రెస్‌కార్డు అందిస్తున్న హెచ్చెం

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

పాలకుర్తి: మండల పరిధిలోని బోడగుట్టపల్లి, నక్కిరెడ్డిపల్లి, శాలపల్లి గ్రామాల్లో బుధవారం శ్రీ మహాలక్ష్మీ, భూలక్ష్మీ, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు శ్రీరంగం వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 9గంటలకు అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. సాయంత్రం పంబాల పూజారుల ఆధ్వర్యంలో పోచమ్మతల్లికి కొలుపు నిర్వహించారు. ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు భూతగడ్డల కుమార్, పుప్పాల దయానందం, గట్టయ్య, బుర్ర సదిగౌడ్, మల్లేశం పాల్గొన్నారు.

టాపర్లకు సన్మానం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం ఇంటర్ ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన మండల టాపర్లను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్‌కుమార్ సన్మానించారు. పాఠశాల చైర్మన్ సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, లయన్స్ క్లబ్ జిల్లా కో–ఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు ఆడెపు సదానందం, పెరుమండ్ల హర్ష చక్రవర్తి, చకిలం వెంకటేశ్వర్లు, నాగమల్ల ప్రశాంత్, దావల్ల నరేందర్ పాల్గొన్నారు.